సాక్షి
వికారాబాద్
శనివారం । 30 । నవంబర్ । 2024



లక్ష దీపోత్సవం

వీరభద్రేశ్వరాలయంలో శుక్రవారం మహిళలు కార్తీకమాస లక్ష దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 8లో▸



ప్రారంభించి.. వదిలేశారు!

ఉన్నత లక్ష్యంతో నిర్మించిన నూతన భవనం మౌలిక వసతులు కల్పించక పోవడంతో నిరుపయోగంగా మారింది. 8లో▸



అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

సర్వేకు వివరాలు ఇచ్చిన కలెక్టర్



సర్వే ఫారం నింపుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే వివరాలు కంప్యూటరీకరణ జరుగుతున్నాయని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఎన్యుమరేటర్ సుధాకర్‌రెడ్డికి కుటుంబ వివరాలు అందజేశారు. స్వయంగా ఫారం నింపి సంతకం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న సర్వేకు ప్రజలు సంపూర్ణంగా సహకరిస్తున్నారన్నారు.

నిబంధనల ప్రకారమే బిల్లులు

డీఆర్డీఓ పీడీ శ్రీనివాస్



కుల్కచర్లలో బిల్లులను పరిశీలిస్తున్న అధికారులు

కుల్కచర్ల: నిబంధనల ప్రకారమే బిల్లులు మంజూరు ఉంటుందని డీఆర్డీఓ పీడీ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఈఈ ఉమేష్ అన్నారు. అమ్మ ఆదర్శ కమిటీ పనులకు సంబంధించి తమకు బిల్లులు తక్కువగా వచ్చాయని మహిళా సంఘాల ప్రతినిధులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం నిర్వాహకులతో సమీక్ష నిర్వహించి పనుల నిర్వహణ, ఎంబీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పనిచేసిన వ్యక్తుల కూలీల అంశం మినహా ఏ అంశంలోనూ బిల్లులు తక్కువగా రాలేదని కూలీ డబ్బులు సైతం అన్ని ప్రాంతాల వారీగా ముందస్తుగా నిర్ణయించిన ప్రకారం చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఎం శోభ, ఏపీఓ చంద్రశేఖర్, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పెన్షన్ హామీ అమలు చేయాలి

ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి

షాద్‌నగర్: ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని ఎన్‌పీఆర్‌డీ (వికలాంగుల హక్కుల జాతీయ వేదిక) జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం సభ్యులు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భుజంగరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆసరా పెన్షన్ రూ.6వేలకు పెంచుతామని రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. ఏడాది కావొస్తున్నా నేటికీ హామీ అమలు చేయడం లేదన్నారు. జీఓ–17ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సదరం సర్టిఫికెట్‌లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని, విద్యాంగుల శాఖల్లోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న మహిళా శక్తి క్యాంటీన్లలో దివ్యాంగులకు ఐదు శాతం కేటాయించాలని, తీవ్ర వైకల్యం ఉన్న దివ్యాంగులకు ప్రత్యేక అలవెన్స్‌ను ఇవ్వాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చేగూరి శేఖర్‌గౌడ్, నాయకులు వేముల కుసుమ, సంతోష, గౌసియా తదితరులు ఉన్నారు.

నిర్లక్ష్య డ్రైవింగ్‌కు ఏడాది జైలు

యాచారం: నిర్లక్ష్యంగా బైక్ నడిపి ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి ఇబ్రహీంపట్నం న్యాయస్థానం ఏడాది జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించింది. యాచారం సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తక్కళ్లపల్లి తండాకు చెందిన గాగి, హనుమ భార్యాభర్తలు. వారు 2019లో తమ వ్యవసాయ పొలం నుంచి కాలినడకన ఇంటికి వెళుతున్నారు. మార్గమధ్యలో నగరంలోని కాప్రాకు చెందిన సొరకాయల శ్రీను మాల్ నుంచి బైక్‌పై యాచారం వైపు వస్తుండగా భార్యాభర్తలను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హనుమకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య గాగికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి పూర్తి వివరాలను కోర్టులో సమర్పించగా శుక్రవారం ఇబ్రహీంపట్నం న్యాయస్థానం నిందితుడు శ్రీనుకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించింది. అదే విధంగా శ్రీనుకు బైక్ ఇచ్చిన ఏపీలోని ప్రకాశం జిల్లా పొదిలికి చెందిన లక్ష్మీనారాయణకు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

కారులో కల్లోలం

గులాబీ జిల్లా అధ్యక్షుడిపై నేతల గుర్రు

- దీక్షా దివస్‌లో గళమెత్తిన నేతలు
- మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి పేరు ప్రస్తావించకపోవడంతో రచ్చ
- జిల్లా ఇన్‌చార్జి నవీన్‌కుమార్‌రెడ్డి ఎదుటే ఆనంద్ తీరుపై మండిపడిన నాయకులు



వికారాబాద్‌లో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమంలో ఆందోళన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వికారాబాద్: గులాబీ దళంలో గ్రూపు తగాదాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. బీఆర్ఎస్ సమావేశమేదైనా లొల్లి లేకుండా ముగియడం లేదంటే పరిస్థితి ఇట్టే అర్థం పడుతోంది. గులాబీ జిల్లా దళపతి తీరును నేతలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాల్లోనూ రెపరెపలాడిన జెండా 2023 ఎన్నికల్లో ఏ నియోజకవర్గంలోనూ తన ప్రాభవం చాటలేకపోయింది. అయినప్పటికీ ఎవరికీ వారే యమునా తీరే అన్న చందంగా నేతల పరిస్థితి కనిపిస్తోంది.

పట్నం పేరు ప్రస్తావించని అధ్యక్షుడు

శుక్రవారం వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన దీక్షాదివస్ కార్యక్రమంలోనూ రచ్చరేగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ స్వాగతోపన్యాసంలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేరు ప్రస్తావించ లేదు. దీంతో కార్యకర్తలు ఒక్కసారిగా స్టేజీ వద్దకు దూసుకువస్తూ ఆందోళన చేపట్టారు. దీంతో కాసేపు గందరగోళ వాతావరణం నెలకొంది. చివరకు ఆయన క్షమాపణ కోరుతూ.. నరేందర్‌రెడ్డి గురించి చెప్పాల్సింది చాలా ఉన్నందున కాసేపటికి క్షుణ్ణంగా మాట్లాడి ఖండించాలనే ఉద్దేశంతోనే ముందుగానే ప్రస్తావించలేదని ఆనంద్‌కుమార్ సంజాయిషీ ఇచ్చుకున్నారు.

సన్నాహక సమావేశంలోనూ..

తాజాగా మూడు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన దీక్షాదివస్ సన్నాహక సమావేశంలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో ఆయనపైనే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని నలుగురు మాజీ ఎమ్మెల్యేల్లో ఒకరు(పట్నం నరేందర్‌రెడ్డి) లగచర్ల ఘటన కేసులో రిమాండ్‌లో ఉండగా తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి గైర్హాజరయ్యారు. జిల్లా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరవగా పరిగి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

అధ్యక్షుడిపై అసంతృప్తి

ఏ మీటింగ్ నిర్వహించినా సమావేశం ఉద్దేశం కంటే జిల్లా అధ్యక్షుడిపై అసంతృప్తిని వినిపించేందుకే నేతలు ప్రాధాన్యత ఇస్తున్నారంటే పార్టీ నేతల మధ్య సఖ్యత ఏమేర ఉందో అర్థం చేసుకోవచ్చు. మూడు రోజుల క్రితం మాజీ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండల అధ్యక్షుడు మొదలుకుని నియోజకవర్గ, జిల్లా నేతల వరకు అధ్యక్షుడి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరికొందరు తమకు సమాచారమే ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో జిల్లాలో పార్టీ పరిస్థితి బాగానే ఉన్నప్పటికీ స్వయంకృతాపరాధం వల్లే ఓడిపోయామని కొందరు నేతలు పేర్కొన్నారు. మరికొందరు నేరుగా జిల్లా అధ్యక్షుడు వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే వైఖరి కూడా ఇందుకు కారణమని పేర్కొన్నారు. లోక్ సభ ఎన్నికల్లో కీలక నాయకులే పక్క పార్టీల అభ్యర్థులకు ఓట్లు వేయించారని మరికొందరు ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజలే తిరుగబడుతుంటే మనం దాన్ని అందిపుచ్చుకోలేక పోతున్నామని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల కేటీఆర్ మోమిన్‌పేటలో రైతు సమావేశం నిర్వహించేందుకు సైతం సహకరించకపోవటంపై కొందరు నేతలు ప్రస్తావించినట్లు తెలిసింది.

'కారు' దిగుతారా.?

అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి పోల్చుకుంటే బీఆర్ఎస్ పరిస్థితి మరింత దిగజారిపోతోందని పార్టీ నేతల మాటల్లో అర్థమవుతోంది. ఎన్నికల అనంతరం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, పార్టీకి వెన్నుదన్నులా వ్యవహరించిన మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు 'కారు' దిగి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తాజాగా మరికొందరు మండల, నియోజకవర్గ స్థాయి నేతలు సైతం హస్తం గూటికి చేరేందుకు సిద్ధమవుతున్నారనే ప్రచారం సాగుతోంది. మోమిన్‌పేట మండల నేతలు ఇప్పటికే కాంగ్రెస్ పెద్దలతో సంప్రదింపులు జరిపి గులాబీ గూటిని వీడేందుకు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

కేసీఆర్ దీక్షతోనే ప్రత్యేక రాష్ట్రం

- తెలంగాణ అభివృద్ధి ఘనత ఆయనదే..
- గెలిచిన ఏడాదిలో రేవంత్‌రెడ్డి ఆగం చేసిండు
- 'దీక్షా దివస్'లో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి

వికారాబాద్: చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని దీక్షాదివస్ కార్యక్రమ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధిష్టానం పిలుపు మేరకు శుక్రవారం వికారాబాద్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఆనంద్ అధ్యక్షతన దీక్షాదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి, కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం అమరులకు నివాళి అర్పించారు. ఉద్యమకారులను సన్మానించారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. సీమాంధ్ర పాలనలో అనచివేతకు, వివక్షకు గురైన తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు కేసీఆర్ ఉద్యమ సారథి అయ్యాన్నారు. కేంద్రం మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టారన్నారు. తెచ్చుకున్న తెలంగాణలో అన్నివర్గాలకు న్యాయం చేసేలా పాలన సాగించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోపే అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. లగచర్ల ఘటనే ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. రేవంత్‌రెడ్డి ఫెయిల్యూర్ సీఎం అన్నారు. రేవంత్‌రెడ్డికి చేతనైతే ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 17 నియోజకవర్గాల్లో ఎక్కడి నుంచైనా గెలిచి చూపాలని సవాల్ విసిరారు.

కేసీఆర్ సారథ్యంలో బంగారు తెలంగాణ

అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ బంగారు తెలంగాణ అయిందన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టులతో ప్రజల మన్ననలందుకున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. లగచర్ల ఘటనతో సీఎం రేవంత్‌రెడ్డి జీరో అయితే నరేందర్‌రెడ్డి హీరో అయ్యారన్నారు.

రైతుబాంధవుడు

పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ దీక్ష చేపట్టకుంటే తెలంగాణ వచ్చేదా అని ప్రశ్నించారు. నాడు ఆంధ్రపాలకుల తొత్తులుగా ఉన్నవారికి కేసీఆర్ గురించి మాట్లాడే హక్కులేదన్నారు. తెచ్చుకున్న తెలంగాణలో రైతుబీమా, రైతు బంధులాంటి చారిత్రాత్మక పథకాలు తీసుకువచ్చి రైతుబాంధవుడుగా మారారన్నారు. తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఉద్యమం ఎగిసిపడిందన్నారు. అమరులకు మనం రుణపడి ఉండాలన్నారు. కేసీఆర్ పాలనలో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ప్రతిజిల్లాకు ఓ మెడికల్ కళాశాల నిర్మించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. విద్య, వైద్యంలో తెలంగాణ దేశంలోనే ముందువరుసలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ విజయ్‌కుమార్, విద్యా మౌలిక వసరుల కల్పన సంస్థ రాష్ట్ర మాజీ చైర్మన్ నగేందర్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, పరిగి మున్సిపల్ చైర్మన్ అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్, మాజీ ఎంపీపీలు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు, పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దీక్షాదివస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి తదితరులు



అధికారులతో సమావేశమైన అడిషనల్ కలెక్టర్ సుధీర్


విజయోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులను ఆదేశించారు. పురపాలక పరిపాలన కమిషనర్, డైరెక్టర్ టీకే శ్రీదేవి విజయోత్సవాలపై శుక్రవారం సీడీఎంఏ ప్రధాన కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్లు, మెప్మా పీడీలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ.. విజయోత్సవాల్లో భాగంగా డిసెంబర్ 3న 2కే రన్ నిర్వహించాలని అధికారులకు చెప్పారు. మున్సిపాలిటీల్లో సుందరీకరణ కార్యక్రమాలు చేపట్టాలని కమిషనర్లకు సూచించారు. ప్రధాన కూడళ్లు, కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. మహిళా సంఘాల గ్రూపులకు రుణాల చెక్కులు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో మెప్మా పీడీ రవికుమార్, మున్సిపల్ కమిషన్లు జాకీర్ అహ్మద్, విక్రమ్ సింహారెడ్డి, వెంకటయ్య, బలరాం నాయక్, టౌన్ మిషన్ కోఆర్డినేటర్లు వెంకటేశ్, రాజేంద్రప్రసాద్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సహనంతో వినాలి

ఎస్పీ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

మోమిన్‌పేట: స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను సహనంతో వినాలని ఎస్పీ కె.నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని సీఐ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఫిర్యాదులను ఓర్పుతో విన్నప్పుడే సమస్యకు సమాధానం దొరుకుతుందన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అవలంబించాలన్నారు. తల్లిదండ్రులను చూసుకోని వారుంటే వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం భూములు ధరలు కుటుంబ సభ్యులే తగాదాలు పడుతున్నారని వాటిని సున్నితంగా పరిష్కరించాలన్నారు. మూడు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో నిషేధిత వస్తువులపై నిఘా పెంచాలన్నారు. గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, ఇసుక, ఎర్ర మట్టి తదితర వాటిపై దృష్టి సారించాలన్నారు. ప్రతీ గ్రామంలో కెమెరాల ఏర్పాటు, వాటి పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. సీఐ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐలు అరవింద్, అరుణ్ కుమార్, సురేశ్ తదితరులు ఉన్నారు.

ఓపెన్ స్కూల్‌లో స్పెషల్ అడ్మిషన్స్

కద్లాల్: దూర విద్యా విధానంలో టెన్త్, ఇంటర్ పూర్తి చేయాలనుకునే వారికి తెలంగాణ ఓపెన్ స్కూల్ అవకాశం కలిపిస్తోందని హెచ్ఎం జంగయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 2 నుంచి డిసెంబర్ 12 వరకు ప్రత్యేక అడిషన్ల స్వీకరణకు నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు.

అఘాయిత్యాలకు పాల్పడితే కఠినంగా శిక్షించాలి

ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి

అనంతగిరి: మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి డిమాండ్ చేశారు. శుక్రవారం మహిళా హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వికారాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఐద్వా ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అరుణజ్యోతి మాట్లాడుతూ.. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మతం, కులం, ప్రాంతం పేరిట ముసుగుదాడులు పెరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి అనసూయ, ఐద్వా సభ్యులు రేణుక, సునీత, పుష్ప, నాగమ్మ, లక్ష్మి, కాంతమ్మ, అంజలి, సుజాత, దేవిబాయి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

రంగారెడ్డి డీపీఓ సురేశ్‌మోహన్

మహేశ్వరం: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని రంగారెడ్డి డీపీఓ సురేశ్‌మోహన్ సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని తుమ్మలూరులోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో మెనూ ప్రకారమే భోనాలు వడ్డించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లి దండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

అనంతగిరి: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని కోర్టు భవనంలో పోలీసు అధికారులతో కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా పరిధిలోని ఠాణాలత్లో రాజీకి సిద్ధంగా ఉన్న కేసుల వివరాలను సేకరించాలన్నారు. ఆ కేసుల్లో ఇరు పక్షాల వారు డిసెంబర్ 14న నిర్వహించే లోక్ అదాలత్‌లో రాజీకి వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డీబీ శీతల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి శృతిదూత, పీపీ సమీనా బేగం, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ భీంకుమార్, రఘురాం, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌కుమార్, ఎస్ఐలు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బషీరాబాద్‌ ఎస్‌ఐగా శంకర్‌


గఫార్‌ను సన్మానిస్తున్న నూతన ఎస్‌ఐ

బషీరాబాద్‌: బషీరాబాద్‌ నూతన ఎస్‌ఐగా పి.శంకర్‌ నియమితులయ్యారు. వారం రోజుల పాటు ఎస్పీ కార్యాలయంలో వెయిటింగ్‌ జాబితాలో ఉన్న ఆయనకు ఉన్నతాధికారులు బషీరాబాద్‌లో పోస్టింగ్‌ ఇచ్చారు. గతంలో ఆయన రెండుసార్లు యాలాల మండల ఎస్‌ఐగా పనిచేశారు. ఈ మేరకు శుక్రవారం గఫార్‌ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ మూడు నెలల పాటు పనిచేసిన గఫార్‌ ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ని ఎస్‌ఐ శంకర్‌, ఏఎస్‌ఐ నారాయణ, పోలీసు సిబ్బంది శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జమిందార్లు, కానిస్టేబుల్స్‌ పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న లారీ సీజ్‌


పట్టుబడిన లారీ

దోమ: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఓ లారీను పోలీసులు పట్టుకొని సీజ్‌ చేసిన ఘటన దోమ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పరిగి పట్టణం నుంచి ఓ లారీని దోమ మండలం మీదుగా కుల్కచర్ల మండలానికి తరలిస్తున్న క్రమంలో పోలీసులు గొడుగోనిపల్లి శివారులో పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో లారీని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆనంద్‌ కుమార్‌ తెలిపారు.

ధాన్యం లోడు లారీ బోల్తా


రోడ్డుపై పడి ఉన్న వడ్ల లారీ

దోమ: కొనుగోలు సెంటర్‌ నుంచి వడ్లు తరలిస్తున్న ఓ లారీ బోల్తా పడిన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దిర్సంపల్లి సెంటర్‌ నుంచి ధాన్యం బస్తాలను వేసుకున్న లారీ ఐనాపూర్‌ గ్రామం మీదుగా మోత్కూర్‌ సెంటర్‌కు తరలిస్తున్న క్రమంలో అనంతరెడ్డిపల్లి గేట్‌ సమీపంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు కాగా స్థానికులు వెంటనే గమనించి ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు
వ్యక్తికి తీవ్ర గాయాలు

మొయినాబాద్‌: అతివేగంతో ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని కారు, బైకును ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని ఎనికేపల్లి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్‌ మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌ గ్రామానికి చెందిన కట్టమీది సత్తయ్య మేస్త్రి పనిచేస్తున్నాడు. కాగా ఈ నెల 27న ఉదయం 10 గంటల సమయంలో బాకారం సమీపంలో ఉన్న డ్రీమ్‌ వ్యాలీ రిసార్ట్స్‌లో పనిచేయడానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఎనికేపల్లి గ్రామ సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా ఓ గుర్తుతెలియని కారు అతివేగంతో వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌ నడుపుతున్న సత్తయ్య కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌ నుజ్జునుజ్జయ్యింది. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


పార్వతీమాత ఎదుట శ్రీ ఆకారంలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు


ఉజ్జయినీ మహాకాళేశ్వరుని ఆకారంలో ఆర్ట్‌ వేసి దీపాలను వెలిగిస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో లక్ష దీపోత్సవం

మండల కేంద్రంలోని వీరభద్రేశ్వరాలయంలో శుక్రవారం మహిళలు కార్తీకమాస లక్ష దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకే సంప్రదాయ దుస్తులు ధరించి ఆలయానికి చేరుకుని ఉజ్జయినీ మహాకాళేశ్వరుడి ఆకారంలో ఆర్ట్‌ వేసి చుట్టూ ప్రమిదలు ఏర్పాటు చేసి వెలిగించారు. పువ్వులతో ఓం, శ్రీ, స్వస్తిక్‌ వేసి దీపాలు పెట్టారు. గణపతి, కపిలేశ్వరస్వామి, పార్వతీమాత, వీరభద్రేశ్వరస్వామి, నాగదేవత, నందీశ్వరస్వామి, ధ్వజస్తంభం, నవ గ్రహాలను సుందరంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు చెన్నబసవయ్య, కుమారస్వామి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. – ధారూరు


కపిలేశ్వరస్వామిని అలంకరిస్తున్న పూజారి చెన్న బసవయ్య స్వామి


ఓం ఆకారంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

షాద్‌నగర్‌: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పాటై ఏడాదవుతున్న సందర్భంగా మహబూబ్‌నగర్‌ జిల్లా కేంద్రంలో రైతు పండగ సభ నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి శుక్రవారం రైతులు పెద్ద ఎత్తున బస్సుల్లో తరలివెళ్లారు. ఈ బస్సులను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తుందన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఏర్పడ్డ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిషలు శ్రమిస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఏడాది పండగలో వ్యవసాయ పనిముట్లు, ఆధునిక వ్యవసాయ విధానం వంటి వాటిని ప్రదర్శించేందుకు ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సులోచన, వైస్‌ చైర్మన్‌ బాబర్‌ఖాన్‌, ఏడీఏ రాజారత్నం, ఏఓ నిషాంత్‌, కృష్ణారెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానం.. మధ్యాహ్న భోజనం

నాసిరకంగా అన్నం, కూరలు

- ప్రభుత్వ పాఠశాలల్లో కానరాని మెనూ
- వారానికి ఒకట్రెండు రోజులే గుడ్డు
- విద్యార్థులకు అందని పౌష్టికాహారం

దౌల్తాబాద్‌: ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల ఫుడ్‌ పాయిజన్‌ కారణంగా విద్యార్థులు ఆస్పత్రి పాలవుతున్నా.. అధికారుల తీరులో మాత్రం మార్పు రావడం లేదు. నాణ్యమైన భోజనం వండి పెట్టాల్సిన నిర్వాహకులు అలసత్వం వీడడంలేదు. వెరసి విద్యార్థుల పాలిట శాపంగా మారుతోంది. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజనం అమలు చేస్తుంది. కూరగాయాలు, ఆకుకూరలు, ఉడికించిన కోడి గుడ్లు అందించాల్సి ఉండగా పూర్తి స్థాయిలో మెనూ ప్రకారం అమలు కావడంలేదు. ఉడకని అన్నం నీళ్ల పప్పు, అప్పుడప్పుడు అన్నంలో పురుగులు రావడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

నాసిరకం భోజనమే దిక్కు

విద్యార్థులకు అన్నంతో పాటు పప్పు, కూరగాయలు, ఆకుకూరలు అందించాల్సి ఉంటుంది. అయితే చాలా పాఠశాలల్లో నీళ్ల చారు, టమాట, కిచిడీ వండిపెడుతున్నారు. ఇదేమిటని నిర్వాహకులను అడిగితే మధ్యాహ్న భోజన బిల్లులు రాక అవస్థలు పడుతున్నామని అంటున్నారు. అప్పు చేసి వండిపెడుతున్నామని బదులిస్తున్నారు. అయితే కొంతమంది విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తినలేక ఇంటి నుంచే బాక్సులు తీసుకు వస్తున్నారు. శుక్రవారం మండలంలోని గోకఫసల్‌వాద్‌ ఉన్నత పాఠశాలలో కోడిగుడ్డుకు బదులు అరటిపండు ఇచ్చారు. ఉడకని అన్నం ఉండడంతో ఇదేంటని అడిగితే బియ్యం అలాగే వచ్చాయని అంటున్నారు. బియ్యంలో పురుగులు ఉన్నాయని వాటిని జల్లెడ పట్టి చేశాయమని నిర్వాహకులు సెలవిచ్చారు.

మెనూలో గుడ్డు మాయం

మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వారానికి మూడు రోజుల పాటు కోడి గుడ్డు అందించాల్సి ఉంటుంది. అయితే ఒకట్రెండు రోజులు మాత్రమే అందిస్తున్నట్లు తెలుస్తుంది. గుడ్డు ధర రూ.7 ఉండగా ప్రభుత్వం రూ.5 మాత్రమే చెల్లిస్తుంది. ఒక్కో గుడ్డుపై రూ.2 భారం పడుతుంది. దీంతో మూడు రోజులు గుడ్డు అందించకుండా అరటిపండు అందిస్తున్నారు.


గోకఫసల్‌వాద్‌ పాఠశాలలో గుడ్డుకు బదులు అరటిపండు అందిస్తున్న సిబ్బంది


ఇంటి నుంచి తెచ్చుకున్న కూరలతో భోజనం చేస్తున్న విద్యార్థులు

ఇంటికి వెళ్లి తింటా



పాఠశాలలో చారు, అన్నం మాత్రమే పెడతారు. ఒక్కోసారి అన్నం ఉడకదు. అందుకే ఇంటికి వెళ్లి తింటాను. మధ్యాహ్న భోజనం మంచిగా ఉంటే ఇక్కడే తింటాం. కొంత మంది విద్యార్థులు టిఫిన్‌ తెచ్చుకుంటారు. నాణ్యమైన ఆహారాన్ని అందించాలి.
– ఆశ్రిత శ్రీ, ఏడో తరగతి, విద్యార్థిని, దౌల్తాబాద్‌

తనిఖీ చేస్తున్నాం



పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత వండాలని సూచించాం. పాఠశాలల్లో తనిఖీ చేస్తున్నాం. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని నిర్వాహకులు, హెచ్‌ఎంలకు ఆదేశాలు ఇచ్చాం. ఎక్కడా లోటుపాట్లు లేకుండా మధ్యాహ్న భోజనం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
– వెంకటస్వామి, ఎంఈఓ, దౌల్తాబాద్‌

నాణ్యమైన భోజనం అందించాలి

తాండూరు టౌన్‌: ప్రభుత్వ గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందించాలంటూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌(ఏబీవీపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం తాండూరులో ఆందోళన నిర్వహించారు. స్థానిక బస్టాండ్‌ సమీపంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఏబీవీపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు పలువురు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌ హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ప్రభుత్వ గురుకులాల్లోని ఫుడ్‌ పాయిజన్‌ కారణంగా 51 మంది విద్యార్థులను పొట్టన పెట్టుకుందని ఆరోపించారు. అలాగే 886 మంది విద్యార్థులు ఇప్పటి వరకు ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారన్నారు. ప్రభుత్వం గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ సభ్యులు చేతన్‌సింగ్‌, మధుసూదన్‌రెడ్డి, ప్రవీణ్‌చారి, భానుప్రసాద్‌, తనుష్‌, వంశీ తదితరులు పాల్గొన్నారు.


తాండూరు పట్టణంలోని బస్టాండు వద్ద రోడ్డుపై ఆందోళన చేపట్టిన ఏబీవీపీ కార్యకర్తలు

హిందువులు ఏకం కావాలి

వికారాబాద్‌లో హిందూ సంఘాల నిరసన

అనంతగిరి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని పలు హిందూ సంఘాలు డిమాండ్‌ చేశాయి. శుక్రవారం వికారాబాద్‌ పట్టణంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో బీజేఆర్‌ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌ హిందువులపై జరుగుతున్న దాడులు చూసైనా హిందూ సమాజం మారక పోతే భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించారు. హిందూ సమాజం ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్‌, ప్రశాంత్‌కుమార్‌, శ్రీధర్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, యాదగిరి, శివరాజ్‌, అనిల్‌యాదవ్‌, చరణ్‌రెడ్డి, సాయిక్రిష్ణ ముదిరాజ్‌, రాజేందర్‌గౌడ్‌, సాయిగౌడ్‌, కరణం కిషోర్‌, నరేందర్‌ రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేపట్టిన నాయకులు

అదనపు గదులు పూర్తి చేయండి


స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

అనంతగిరి: వికారాబాద్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో తరగతి గదులు సరిపడక ఇబ్బందులు పడుతున్నామని పలువురు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం వికారాబాద్‌లో అసెంబ్లీ స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఆవరణలో చేపడుతున్న అదనపు గదుల నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయిందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ నిర్మాణం పూర్తయితే 10 గదులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నిర్మాణం వెంటనే పూర్తయ్యేలా చూడాలని విద్యార్థులు కోరారు. దీనిపై స్పీకర్‌ సానుకూలంగా స్పందించారు.

నైపుణ్యాభివృద్ధిపైనే ప్రభుత్వం దృష్టి

సాక్షి, సిటీబ్యూరో: దాదాపు 16 లక్షల ఉద్యోగాలు కొత్తగా రానున్నాయనే అంచనాల నేపథ్యంలో 2030 నాటికి నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని నిర్మించడంపై రాష్ట్రం దృష్టి సారిస్తోందని ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టింగ్‌ సంస్థ 'ఈవై –పార్థినాన్‌, కాన్ఫడరేషన్‌ ఆఫ్‌ ఇండియన్‌ ఇండస్ట్రీ (సీఐఐ)' సంయుక్త నివేదిక వెల్లడించింది. సోమాజిగూడలోని పార్క్‌ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన ఓ సమావేశంలో 'బ్రిడ్జింగ్‌ ది గ్యాప్‌: ఇంటిగ్రేటింగ్‌ స్కిల్లింగ్‌ ఇన్‌ టు తెలంగాణాస్‌ ఎడ్యుకేషన్‌ సిస్టమ్‌ రిపోర్ట్‌' పేరిట రూపొందిన నివేదిక వివరాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈవై –పార్థెనన్‌ భాగస్వామి డాక్టర్‌ అవంతిక తోమర్‌ మాట్లాడుతూ, 'సంప్రదాయ విద్యా నమూనాలలో నైపుణ్య విద్య, వృత్తి శిక్షణను మిళితం చేయడం ఎదుగుదలకు, పోటీతత్వానికి కీలకం. తెలంగాణకు నైపుణ్య విద్యలో పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి' అని అన్నారు. సీఐఐ చైర్మన్‌ సాయి ప్రసాద్‌ మాట్లాడుతూ పరిశ్రముల ఇంటర్న్‌షిప్‌ల ఏకీకరణ, విద్యార్థులకు మాత్రమే కాకుండా, అధ్యాపకులకు కూడా ఇంటర్న్‌షిప్‌లను తప్పనిసరి చేయడం ద్వారా, అధ్యాపకులు పరిశ్రమ విధానాలతో మరింత సన్నిహితంగా ఉండేలా చూస్తున్నామన్నారు.

బుగ్గ జాతరపై డీసీపీ సమీక్ష

మంచాల: మండల పరిధిలోని ఆరుట్ల బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతరను మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి శుక్రవారం సమీక్షించారు. జాతర ఏర్పాట్లపై స్థానిక పోలీసులతో కలిసి ఆమె పర్యవేక్షణ చేశారు. భక్తుల రద్దీ, పార్కింగ్‌ ఇతర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిత్యం వేలాది మంది భక్తులు వచ్చే జాతరలో పోలీసుల పాత్ర కీలకమైందన్నారు. నిరంతరం నిఘా నీడలో జాతర కొనసాగుతుందన్నారు. ప్రత్యేకంగా పోలీసు పహారా ఏర్పాటు చేయడమే కాకుండా సీసీ కెమెరాల ఆధారంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. విరామం లేకుండా ఉత్సవాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్‌ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ఏసీపీలు రాజు, లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐ మధు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభించారు.. వదిలేశారు!

ఉన్నత లక్ష్యంతో నూతన భవనాన్ని నిర్మించారు. కానీ మౌలిక వసతులు కల్పించక పోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. శ్యామ్‌ ప్రసాద్‌ ముఖర్జీ రూర్బన్‌ మిషన్‌ కింద అంతారంలో నిర్మించిన ఆడిటోరియం దాదాపు ఐదు నెలలుగా ఉపయోగంలో లేకుండా పోయింది.

రూ.2 కోట్లతో నిర్మించిన ఆడిటోరియం

- ఐదు నెలలుగా నిరుపయోగంగా ఉన్న భవనం



అంతారం గుట్ట వద్ద నిర్మించిన ఆడిటోరియం

తాండూరు రూరల్‌: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 2016లోనే మండలంలోని అల్లాపూర్‌(ఎస్‌) క్లస్టర్‌ను శ్యామ్‌ ప్రసాద్‌ ముఖర్జీ రూర్బన్‌ మిషన్‌(ఎస్పీఎంఆర్‌ఎం) కింద ఎంపిక చేశారు. పట్టణ తరహా మౌలిక సదుపాయాలు పల్లెల్లో కల్పించాలనే ఉద్దేశంతో ఎస్పీఎంఆర్‌ఎం పథకాన్ని అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. మండలంలో 33 గ్రామ పంచాయతీల్లో పట్టణ తరహా మౌలిక సదుపాయాల కోసం అప్పట్లో రూ.30 కోట్ల వరకు నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని అంతారం గ్రామ శివారులోని అంతారం గుట్ట వద్ద రూ.2 కోట్లతో ఆడిటోరియాన్ని 2016లో మంజూరు చేశారు. కాంట్రాక్టర్‌ పనులు మధ్యలో నిలిపి వేసి చేతులెత్తేశాడు. ఎన్నికల కోడ్‌, బిల్లుల ఆలస్యం కారణంగా ఎనిమిదేళ్లుగా భవన నిర్మాణం నిలిచిపోయింది. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో సబ్‌ కాంట్రాక్టర్‌తో ఈ ఏడాది మార్చి లోపు ఆడిటోరియం పనులు పూర్తి చేయించాడు. 2024 జూలై 2వ తేదీన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆడిటోరియాన్ని ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు అధికారులు దాన్ని అందుబాటులోకి తేవడం లేదు. ప్రారంభ సమయంలో ఎమ్మెల్యే ఆడిటోరియంలో మౌలిక సదుపాయాల కోసం అవసరమైతే నిధులు కూడా కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కానీ అధికారులు ఆడిటోరియం వైపు కన్నెత్తి చూడడం లేదు.

ఎన్నో ప్రత్యేకతలు

అంతారంగుట్ట వద్ద ఆడిటోరియం భవనాన్ని చక్కగా నిర్మించారు. సౌండ్‌ సిస్టంతో పాటు పెద్ద తెరలు కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. ఆడిటోరియం లోపల భాగంగా రెండు గదులు, స్టేజీతో పాటు పెద్ద హాల్‌ కూడా ఉంది. ముఖ్యంగా అన్ని శాఖల అధికారులతో నియోజకవర్గస్థాయి సమావేశాలు నిర్వహించవచ్చు. ప్రభుత్వానికి సంబంధించి అధికారిక కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు వీలుంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆడిటోరియాన్ని అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎంపీడీఓ ఆఫీస్‌కు అప్పగించాం



రూర్బన్‌ పథకం కింద 2016లో రూ.2 కోట్లతో ఆడిటోరియం మంజూరైంది. నిర్మాణ వ్యయం పెరగడంతో కాంట్రాక్టర్‌ మధ్యలోనే వదిలేశాడు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఎస్‌డీఎఫ్‌ కింద నిధులు మంజూరు చేశారు. దీంతో భవనం పూర్తి చేశాం. ప్రస్తుతం ఆడిటోరియాన్ని ఎంపీడీఓ కార్యాలయానికి అప్పగించాం.
– నందిని, ఏఈ, పీఆర్‌, తాండూరు

అందుబాటులోకి తెస్తాం



అంతారం గుట్ట వద్ద ఆడిటోరియాన్ని ప్రభుత్వం నిర్మించి మాకు అప్పగించింది. అయితే ఆడిటోరియంలో మౌలిక సదుపాయాలు లేవు. వంటగది, ఫర్నిచర్‌కు నిధులు కావాలి. ఎమ్మెల్యే నిధులు కేటాయిస్తామన్నారు. త్వరలోనే ఆడిటోరియంలో అన్ని వసతులు కల్పించి అందుబాటులోకి తీసుకొస్తాం.
– విశ్వప్రసాద్‌, ఎంపీడీఓ, తాండూరు

రిజర్వేషన్లలో నిబంధనలు సవరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథ్‌యాదవ్‌

అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌యాదవ్‌

షాద్‌నగర్‌: ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్లలో ఉన్న నిబంధనలను ప్రభుత్వం వెంటనే సవరించాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌యాదవ్‌ డిమాండ్‌ చేశారు. శుక్రవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ముగ్గురు అంతకన్న ఎక్కువ మంది సంతానం ఉన్నా పోటీ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వం అన్ని కోణాల్లో ఆలోచించి రాజకీయాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల్లో సంతృప్తి నిచ్చే విధంగా రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. ప్రభుత్వం కులగణన ఆధారంగా రిజర్వేషన్లలో మార్పులు చేసి ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో సంఘం మున్సిపాలిటీ అధ్యక్షుడు నక్కబాల్‌రాజ్‌యాదవ్‌, మాజీ సర్పంచ్‌ పల్లె శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గంగాధర్‌గౌడ్‌, వెంకటేశ్‌యాదవ్‌, అశోక్‌, కృష్ణయ్య పాల్గొన్నారు.